మెసేజ్ వచ్చింది..
చెక్కులే వస్తలేవు.. 2








2
రూపుద్దిదుకుంటున్న గ్రామదేవతల విగ్రహాలు



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## విద్యుత్ సరఫరాలో అంతరాయం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని గూపన్‌పల్లి, దుబ్బ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.


11-7-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఎల్లారెడ్డి సీఐగా రాజారెడ్డి బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దొరగారి రాజారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మెదక్ సీసీఎస్ నుంచి ఆయన్ను తాజాగా ఎల్లారెడ్డి సీఐగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ పనిచేసిన రవీంద్ర నాయక్‌ను ఐజీపీ కార్యాలయానికి అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

## క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు

**అక్షరటుడే, ఇందూరు:** క్రీడా అకాడమీలో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడా అధికారి పవన్ కుమార్ తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16వ తేదీల్లో గచ్చిబౌలి, ఎల్‌బీ స్టేడియంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గచ్చిబౌలిలో హాకీ, అథ్లెటిక్స్, ఎల్బీ స్టేడియంలో ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్ క్రీడలో బాల బాలికలకు (12 నుంచి 16 ఏళ్ల వయసు) ఎంపికలుంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రస్తుత పాఠశాల లేదా కళాశాల స్టడీ సర్టిఫికెట్, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 10 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో సంబంధిత స్టేడియాల్లో ఉదయం 7 గంటల నుంచి హాజరుకావాలని కోరారు.



## విద్యార్థులు చదువులో బాగా రాణించాలి

**అక్షరటుడే, బోధన్:** విద్యార్థులు చదువులో బాగా రాణించాలని మైనార్టీ రెసిడెన్షియల్ సెక్రెటరీ షఫీయుల్లా అన్నారు. బోధన్ పట్టణంలోని మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలో పౌష్టికాహారంతో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి తమ పాఠశాలకు, సిబ్బందికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే నూతనంగా నిర్మించిన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఎల్‌సీ బషీర్ అలీ, డీఎండబ్ల్యూవో కృష్ణవేణి, మైనార్టీ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, కళాశాల సిబ్బంది ఉన్నారు.



> ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కల్తీ కల్లు దందా జోరుగా సాగుతోంది. నిషేధిత అల్ప్రాజోలం ఇతర మత్తు పదార్థాలు వినియోగించి కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. ఈ కల్లు తాగి బానిసగా మారిన వారు పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధి బారిన పడుతున్నారు. అయినా కల్తీ కల్లు తయారీకి మాత్రం అడ్డుకట్ట పడట్లేదు.
> - అక్షరటుడే, నిజామాబాద్

# జోరుగా కల్తీ కల్లు దందా..

- మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున సరఫరా
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. పలువురు చికిత్స పొందుతూ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ, ఎల్లారెడ్డి, నిజామాబాద్ పట్టణాల పరిధిలో పలువురు కల్తీ కల్లు మృత్యువాత పడిన ఘటనలు వెలుగు చూశాయి. అయితే అప్పట్లో కల్లు దుకాణాల్లో తనిఖీలు చేసి హడావుడి చేసిన ఎక్సైజ్ అధికారులు ఆ తరువాత పట్టించుకోవడం లేదు. ఫలితంగా కల్తీకల్లు తయారీ యథేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా ప్రమాదకరమైన అల్ప్రాజోలం, క్లోరో హైడ్రేట్, యూరియా, షాక్రిన్ తదితర రసాయనాలను కలిపి కృత్రిమ కల్లును తయారు చేస్తున్నారు. దీనికి బానిసలుగా మారిన వారికి దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమిస్తున్నాయి. నరాలు, మెదడు సంబంధిత వ్యాధులతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రత్యేకించి పల్లెల్లో యువత ఈ కల్లుకు బానిసలుగా మారుతుండడం ఆందోళన కలిగించే విషయం.

### మూకుమ్మడి తనిఖీలు

కల్తీ కల్లు ఘటనలు వెలుగుచూసిన ప్రతీసారి ఎక్సైజ్ అధికారులు మొక్కుబడి తనిఖీలు చేపడుతున్నారు. అనంతరం చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. బహిరంగంగానే కల్తీ కల్లును తయారు చేస్తున్నారు. హానికర రసాయనాలతో మిషన్ల ద్వారా ప్యాకెట్ల రూపంలో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. తనిఖీల సమయంలో కల్తీకల్లు దొరికినప్పటికీ అందుబాటులో ఉన్న ల్యాబ్‌లలో మాత్రం శాంపిళ్లలో ఏమీ లభించట్లేదని నివేదికలు రావడం గమనార్హం. మరోవైపు నెలవారీ మామూళ్లు తీసుకుంటున్న అధికారులు తనిఖీలకు సంబంధించి కల్లు వ్యాపారులకు ముందస్తుగానే సమాచారం ఇచ్చి.. జాగ్రత్త పడేలా చేస్తున్నారు. అధికారులే వెన్నంటి ఉండడంతో కల్తీకల్లు దందాకు అడ్డుకట్ట పడట్లేదని తెలుస్తోంది.

### అల్ప్రాజోలం తరలిస్తున్నదెవరు..!

నిషేధిత అల్ప్రాజోలాన్ని ఎక్కువగా మహారాష్ట్ర నుంచి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కమిషనరేట్ పోలీసులు మహారాష్ట్రలో అల్ప్రాజోలం తయారు చేస్తున్న ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి పెద్ద ఎత్తున అల్ప్రాజోలం, ముడిసరుకు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ అల్ప్రాజోలం అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. జిల్లాకు సరిహద్దున మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కొందరు అల్ప్రాజోలాన్ని నిల్వ చేసి కల్తీకల్లు తయారీ దారులకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కాగా.. ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని ముందుకు సాగితే కట్టడి చేయవచ్చు.

### భారీగా అల్ప్రాజోలం పట్టివేత

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మాక్లూర్ మండలం చిక్లిలో ఎక్సైజ్ అధికారులు అల్ప్రాజోలం, సీహెచ్‌వోడీని పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ స్వప్న తెలిపిన వివరాల ప్రకారం.. కల్తీ కల్లు తయారు చేసేందుకు మత్తు పదార్థాలు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో చిక్లి వద్ద తనిఖీలు చేశారు. నిందితుల నుంచి సుమారు కిలో వరకు అల్ప్రాజోలం, సీహెచ్‌వోడీని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను పరీక్షల నిమిత్తం పంపించామని చెప్పారు.

## నా అరెస్ట్ రాజకీయ కుట్రలో భాగమే..

**టీపీసీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్ రెడ్డి**



**అక్షరటుడే, కామారెడ్డి:** రాజకీయ కుట్రలో భాగంగానే పేలుడు పదార్థాల కేసులో తనను అరెస్ట్ చేశారని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అరెస్ట్ వెనక ఓ పెద్దమనిషి హస్తం ఉందని ఆరోపించారు. గురువారం రాత్రి బెయిల్‌పై వచ్చిన తర్వాత శుక్రవారం తన కార్యాలయంలో చంద్రశేఖర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సంచలన విషయాలను వెల్లడించారు. ఈ నెల 3న జిల్లా కేంద్రంలో లభించిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్స్ కేసులో తన పేరు చేర్చారని తెలిసిందన్నారు. దీంతో ఈ నెల 5న సీఐ నరహరి కి ఫోన్ చేసి శ్రీవారి వెంచర్ 1800 ఎకరాలకు సంబంధించిన పత్రాలను పంపడం జరిగిందన్నారు. తన పేరుమీద ఇంచు భూమి కూడా లేదని సీఐకి తెలపగా తిరిగి రాత్రి 8 గంటలకు సీఐ తనకు ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని వెళ్లానని తెలిపారు. తాను వెళ్లేసరికి స్టేషన్‌లో ఏఎస్పీ చైతన్య రెడ్డి కూడా ఉన్నారని.. రాత్రి 9 గంటలకు రూరల్ సీఐ రామన్ వచ్చి ఓ ప్రైవేట్ వాహనంలో తనను తీసుకెళ్లారన్నారు. రాత్రి 12 గంటలకు బాన్సువాడ తీసుకెళ్లి ప్రాథమిక పాఠశాలలో కూర్చోబెట్టి మళ్లీ ప్రశ్నలు అడిగారని తెలిపారు. రాత్రి 3 గంటలకు బిచ్కుంద జడ్జి వద్ద హాజరు పరిచారని, ఉదయం 6 గంటలకు నిజామాబాద్ సబ్ జైలుకు తీసుకెళ్లారని వివరించారు. ఈ మొత్తం వ్యవహారం రాజకీయ కుట్రతోనే జరిగిందని స్పష్టం చేశారు. తన అరెస్టు వెనుక ఓ 70 ఏళ్ల పెద్దమనిషి వెనకుండి నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా తీసుకెళ్లానని, పార్టీ తన పట్ల సానుకూలంగా ఉందన్నారు. తనపై కుట్రలు చేసిన పెద్ద మనిషి వివరాలు తనవద్ద ఉన్నాయని.. అవసరం వచ్చినప్పుడు హైకమాండ్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

## మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం




మొక్కను నాటి మట్టి పోస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి

**అక్షరటుడే, బాన్సువాడ:** మానవ మనుగడకు మొక్కలే జీవనాధారమని, ప్రతిఒక్కరూ నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవులు అంతరించిపోవడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. పర్యావరణం సమతుల్యంగా ఉండాలంటే 33 శాతం చెట్లు ఉండాలన్నారు. తాను ఈ కళాశాలలోనే విద్యనభ్యసించానని, కాలేజీకి ఎంతో ఘన చరిత్ర ఉందని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఎఫ్‌డీవో సునీత, ఎఫ్ఆర్ఓ హబీబ్, నోడల్ అధికారి సలీం, ఎజాజ్, దాసరి శ్రీను, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.




శివచరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి

## యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు సీట్ల కేటాయింపునకు కృషి

**అక్షరటుడే, బాన్సువాడ:** స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ సభ్యులకు 25 శాతం సీట్లు కేటాయించే విధంగా కృషి చేస్తానని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీనివాస గార్డెన్ లో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల సమీక్ష సమావేశంలో ఆయన మాటాలడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను గ్రామీణ స్థాయిలో ప్రతి ఇంటికి చేరే విధంగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం 18 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రూపు రాజకీయాలు పక్కనపెట్టి అందరూ కలిసిమెలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు ఏకగ్రీవమయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి అమృత, కాసుల రోహిత్, పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, మన్సూర్, శ్రీనివాస్, సర్దార్, దుర్గం శ్యామల, అలిబిన్, సురేష్ బాబా, ఎజాజ్ పాల్గొన్నారు.

## ఊరపండుగకు బల్మూరి వెంకట్‌కు ఆహ్వానం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో నిర్వహించనున్న ఊర పండుగకు రావాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ను సర్వ సమాజ్ ప్రతినిధులు కోరా రు. ఈ మేరకు శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వానం పలికారు. దీంతో ఆయన హాజరవుతానని చెప్పినట్లు సమాజ్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామ్మూర్తి గంగాధర్, బంటు రాజేశ్వర్, రామడుగు బాలకిషన్, సకినాల ప్రవీణ్ పాల్గొన్నారు.



## నూతన పద్ధతుల్లో కేసుల ఛేదనకు కృషి చేయాలి




మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** సాంకేతికను వినియోగించుకుని నూతన పద్ధతుల్లో కేసుల ఛేదనకు కృషి చేయాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. నగరం లోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో నిర్వ హిస్తున్న పోలీస్ స్టేషన్ రైటర్స్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రస్తుత కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన పద్ధతుల ద్వారా నేరాల నియంత్రణ, కేసుల ఛేదనకు కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో కేసుల పరిశోధనలో నాణ్యతను పెంచి ఎఫ్ఐఆర్ నుంచి ఛార్జ్‌షీట్ రిపోర్టు, స్టేట్‌మెంట్ రికార్డింగ్ వరకు గోపత్య పాటించాలని చెప్పారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో మెలకువలు నెర్చుకుని పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వా రెడ్డి, ట్రైనింగ్ సీటీసీ ఏసీపీ మస్తాన్ అలీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టేట్‌లెవల్ పోలీస్ డ్యూటీమీట్‌లోనూ ప్రతిభ చూపాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా నుంచి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొన్న పోలీసులు రాష్ట్ర జోనల్‌మీట్‌లోనూ ప్రతిభ చూపాలని ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. పోలీస్‌డ్యూటీ మీట్‌లో జిల్లా పోలీసులు 11 పథకాలు సాధించిన సందర్భంగా శనివారం వారిని ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈనెల 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరిగిన 2వ జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో జిల్లా తరపున ఆరుగురు పోలీస్ అధికారులు 11 పతకాలు సాధించారు. గాంధారి ఎస్సై ఆంజనేయులు 5 పతకాలు సాధించారు. అందులో (3 బంగారు, 2 వెండి పతకాలు) ఉన్నాయి. మద్నూర్ ఎస్సై విజయ్ రెండు వెండి పతకాలు సాధించారు. బిచ్కుంద ఠాణా కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, రాజంపేట పీఎస్ కానిస్టేబుల్ చిరంజీవి కాంస్య పతకం సాధించారు. ఏఆర్ విభాగానికి చెందిన రామచంద్రం, ఎల్లారెడ్డిలు విధ్వంసకాల విచ్ఛిన్నంపై తనిఖీ విభాగంలో ఒక్కో వెండి పతకం సాధించారు.




## పత్రిక ప్రకటన

**ఆగస్టు 24న ఉమ్మడి జిల్లా పద్మశాలి వసతిగృహ(హాస్టల్) ఎన్నికలు**

పద్మశాలి వసతిగృహం కార్యవర్గ సమావేశం తేది : 11-07-2025 శుక్రవారం నాడు పద్మశాలి హాస్టల్ యొక్క కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 12-07-2025 నుంచి 20-07-2025 వరకు మీ యొక్క ఓటరు నమోదు మరియు సవరణ చేసుకొనుటకు అవకాశం ఇవ్వడం జరిగింది. 20-07-2025 వరకు సభ్యత్వ నమోదు చేయనిచో తమ యొక్క ఓటు హక్కు కోల్పోవుదురు.

ఆగస్టు 24న ఆదివారం నాడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్నికలు నిర్వహించాలని కార్యవర్గం తీర్మానించింది.

ఇట్లు
రచ్చ మురళి
అధ్యక్షులు మరియు కార్యవర్గం
ఫోన్ : 9848033125

# ఓటరు జాబితా పక్కాగా రూపొందించాలి



**అక్షరటుడే, కోటగిరి :** క్షేత్రస్థాయిలో ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను బీఎల్‌వోలు పక్కాగా రూపొందించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. స్థానిక రైతు వేదికలో కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలాల బీఎల్‌వోలకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒక రైతువేదికలో 50 మంది బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ఓటరు జాబితాలో తప్పులకు తావులేకుండా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ గంగాధర్, ఎలక్షన్ డీటీ సంగమేశ్వర్, ఏఎల్‌ఎంటీఎస్ నరహరి, అశోక్, డీటీ అజీజ్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి




**అక్షరటుడే, ధర్పల్లి:** సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ధర్పల్లి ఎస్సై కళ్యాణి సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. ధర్పల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీపీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మహిళలను వేధిస్తూ షీటీం నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినులను వేధించినా.. సైబర్ క్రైం జరిగినా.. ధర్పల్లి ఎస్సై 8712659856కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సుధాకర్, నాంజి, మోహన్ రెడ్డి, సంతోష్, షీ టీం సిబ్బంది శ్రీకాంత్, రేఖారాణి, హరితారాణి, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇంజినీర్స్ డే



**అక్షరటుడే, నిజాంసాగర్:** తెలంగాణ ఇంజినీర్స్ డేను నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్ట్ ఇంజినీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఈఈలు అక్షయ్ సాకేత్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబరాలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్న నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచన మేరకు నిజాంసాగర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు.

# బీసీలకు 42శాతం రిజర్వేషన్ల నిర్ణయం హర్షనీయం



**అక్షరటుడే, ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తెలిపారు. నగరంలోని కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ 30 ఏళ్ల పోరాట ఫలితమే 42 శాతం రిజర్వేషన్లు అని పేర్కొన్నారు. అలాగే బీసీల కోసం పాటుపడుతున్న జాగృతి అధ్యక్షురాలు కవితకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు దేవేందర్, శంకర్, స్వామి, అజయ్, శ్రీలత, చంద్రకాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన నవజాత శిశువు.. కాపాడిన పోలీసులు

**అక్షరటుడే, బిచ్కుంద:** ఏ తల్లికి భారమో.. లేదా మరే తల్లి కర్కశత్వమో తెలియదు. కానీ.. అప్పుడే పుట్టిన పసికందును రోడ్డు పక్కన పడేశారు. బాహ్య ప్రపంచంలోకి రాగానే తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన ఆ శిశువు.. రోడ్డు పక్కన కనిపించింది. నవజాత శిశువును గమనించిన పోలీసులు ఆ పసికందును కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. బిచ్కుంద మండలం పెద్ద దేవాడ గ్రామ శివారులోని బిచ్కుంద – బాన్సువాడ రోడ్డులో ఓ బ్రిడ్జి వద్ద నవజాత శిశువును రోడ్డు పక్కన పడేశారు. ఆ పసికందును గమనించిన బిచ్కుంద పోలీసులు వెంటనే స్పందించి అక్కున చేర్చుకున్నారు. అనంతరం శిశువును పుల్కల్ పీహెచ్‌సీకి తరలించారు. ఆ తర్వాత బిడ్డకు మెరుగైన చికిత్స అందించేందుకు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడమైందని బిచ్కుంద ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. అలాగే సీడీపీవోకు సమాచారం ఇచ్చి.. శిశువు సంరక్షణార్థం వారికి అప్పగించినట్లు చెప్పారు.

సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు దారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. పలువురు లబ్ధిదారులకు 'చెక్కులు మంజూరయ్యాయని.. వారం రోజుల్లో మీ ప్రజాప్రతినిధి వద్ద తీసుకోవాలని' మెస్సేజ్‌లు వస్తున్నాయి. కానీ నాలుగు నెలలు గడుస్తున్నా చెక్కులు రావడం లేదని దరఖాస్తు దారులు వాపోతున్నారు. ఆస్పత్రిలో వైద్యం కోసం అప్పులు చేసి వైద్యం చేయించుకున్నామని.. కానీ పైసలు అందక అవస్థ పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాంధారి మండల కేంద్రంలో చాలామంది బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందట్లేదని వాపోతున్నారు.

- అక్షరటుడే, గాంధారి




# మెసేజ్ వచ్చింది.. చెక్కులే వస్తలేవు..

- దరఖాస్తు చేసుకుని నాలుగు నెలలు గడుస్తున్నా మంజూరు కాని సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

గాంధారి మండల కేంద్రంలో సుమారు 300 నుంచి 400 మంది రోగులు తమ వైద్యానికి అయిన ఖర్చుల వివరాలతో ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అందులో కొంతమందికి మెసేజ్‌ల రూపంలో 'మీయొక్క చెక్కు ప్రజా ప్రతినిధి కార్యాలయానికి పంపబడింది.. ఏడు రోజుల తర్వాత వచ్చి తీసుకెళ్లండి' అని మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వారు సంబురపడ్డారు. తమకు అయిన ఖర్చులో ఎంతోకొంత వస్తుందనే ఆశతో ఉన్నారు.

**అయోమయంలో దరఖాస్తు దారులు**

అయితే.. ఏడు రోజుల్లో వచ్చి తీసుకెళ్లాలని మెసేజ్‌లు వచ్చినప్పటికీ.. నెలలు గడుస్తున్నా సీఎంఆర్‌ఎఫ్ రాకపోవడంతో బాధితులు ఆందోళనలో ఉన్నారు. దరఖాస్తుకు అన్ని సర్టిఫికెట్లు సరైన పద్ధతిలో జత చేసినప్పటికీ చెక్కు రిలీజ్ కావడంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందో తెలియక లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు. అసలు ఫండ్ వస్తుందా రాదా అని ఆందోళన చెందుతున్నారు.

**ఎంతో కొంత వచ్చినా బాగుండు..**

చెక్కులు ఆలస్యమవుతున్నా కొద్దీ లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. మొత్తానికి రిజెక్ట్ చేయకుండా ఎంతోకొంత వచ్చినా బాగుండు అంటూ నిట్టూరుస్తున్నారు. అసలే మధ్యతరగతి ప్రజలమని.. రాష్ట్ర ప్రభుత్వం అందించే సాయంపైనే ఎన్నో ఆశలు పెట్టుకున్నామని వారు వాపోతున్నారు.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నాయకులు చొరవ చూపి తమకు చెక్కులు అందేలా చూడాలని వారు కోరుతున్నారు. కాగా.. పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు వెళ్లి సంప్రదించగా.. దరఖాస్తు చేసుకున్న తర్వాత వారంరోజుల్లో చెక్ తీసుకోవాలని మెసేజ్‌లైతే వస్తున్నాయని.. కానీ నాలుగు నెలలు సమయం పడుతోందని వారికి చెబుతున్నట్లు సమాచారం.

**చెక్కుకోసం ఎదురు చూస్తున్నాం..**



సీఎం రిలీఫ్ ఫండ్ కోసం సెప్టెంబర్‌లో దరఖాస్తు చేసుకున్నా. జనవరిలో మాకు మెసేజ్ వచ్చింది. కానీ ఇప్పటివరకు ఎలాంటి చెక్కు రాలేదు. మా తండ్రికి చికిత్స చేయించిన అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. స్థానిక ఏఎంసీ ఛైర్మన్ పరమేష్‌ను కలిశాను. త్వరలోనే అందుతుందని చెప్పారు.

– గుర్రం సంజీవ్, గురజాల, గాంధారి

# ఎల్లారెడ్డి ఆర్డీవోకు సన్మానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన పార్థసింహారెడ్డిని జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సభ్యులు సన్మానించారు. జిల్లా రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగం సురేందర్‌తో పాటు పలువురు డీలర్లు శుక్రవారం ఆర్డీవోని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వివిధ మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విఠల్‌గౌడ్ , చంద్రయ్య, నయీం, కిషన్ , వెంకాగౌడ్, నర్సింలు, మామిడి శ్రీనివాస్, ప్యాలాల శ్రీనివాస్ , శివకుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన



**అక్షరటుడే, ఇందల్వాయి:** సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పేర్కొన్నారు. తిర్మన్‌పల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, బాలికల కళాశాలలో ఇందల్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి మాట్లాడుతూ.. దోమల వల్ల వ్యాపించే వ్యాధులపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా పరిపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ డాక్టర్ వినీత్, ఆరోగ్య కార్యకర్తలు శారద, భానుప్రియ, ఆశా కార్యకర్తలు ప్రమీల, జ్యోతి, ప్రియాంక పాల్గొన్నారు.




# వివేకానంద పాఠశాలలో బోనాలు

నగరంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో శుక్రవారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, పోతురాజుల వేషధారణ ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ లతా నారా గౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. – అక్షరటుడే, ఇందూరు

# పాఠశాల భవనం ధ్వంసం.. కేసు నమోదు

**అక్షరటుడే, కోటగిరి :** మండలంలోని హరిలాల్ తండాలో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ధ్వంసం చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుద్దులం తండాకు చెందిన శంకర్, వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన జేసీబీ డ్రైవర్ శ్రీకాంత్ పాఠశాల గోడలు, స్లాబ్ ధ్వంసం చేశారు. దీంతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



# రూపుద్దిదుకుంటున్న గ్రామదేవతల విగ్రహాలు

ఊర పండుగకు గ్రామదేవతల విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. సర్వసమాజ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో నగరంలోని నకాశ్‌గల్లిలో విగ్రహాలను తయారు చేస్తున్నారు. మామిడి దుంగలతో 12 గ్రామ దేవతల విగ్రహాలను రూపొందిస్తున్నారు. మహాలక్ష్మమ్మ, ఐదు చేతుల పోచమ్మ, పౌడాలమ్మ, అడెల్లి పోచమ్మ, పెద్దమ్మ తల్లి, సార్గమ్మలు, అంపుడు పోచమ్మ విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. – అక్షరటుడే, ఇందూరు

# భీమ్‌గల్‌లో కోర్టు ప్రారంభించాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని పలువురు న్యాయవాదులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కోర్టులో ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరతలక్ష్మిని కలిసి విన్నవించారు. ఇటీవల వెలువడిన ఉత్తర్వుల మేరకు పూర్తిస్థాయి సిబ్బందితో త్వరగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు చైతన్య, సురేష్, శ్రీను, సంజీవ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు .

# ఈత మొక్కలు నాటిన అధికారులు




**అక్షరటుడే, బాన్సువాడ:** వనమహోత్సవంలో భాగంగా మండలంలోని సోమేశ్వర్ గ్రామ పంచాయతీ పరిధిలో దేవుని చెరువు కట్టపై ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో అధికారులు వెయ్యి ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, ఏపీవో భిక్షపతి, ఈసీ గంగాధర్, గోపాల్, నర్సింలు, రాము తదితరులు పాల్గొన్నారు.

**మైనార్టీ గురుకుల కళాశాలలో..**




**అక్షరటుడే, లింగంపేట:** మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల కళాశాలలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎస్సై దీపక్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో ఎనలేని సేవలు



**అక్షరటుడే, ఇందూరు:** ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించి విద్యారంగంలో కృపాల్‌సింగ్ ఎనలేని సేవలందించారని విద్యాశాఖ ఉద్యోగులు కొనియాడారు. శుక్రవారం విద్యాశాఖ కార్యాలయంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఏసీఈ వెంకటేష్, సూపరింటెండెంట్లు వాణి, దీపక్, డీఈవో సీసీ రాజేష్, మహేందర్, శివకుమార్, దిలీప్, శోభన్, నిశాంత్ అస్రార్ తదితరులు పాల్గొన్నారు.